సాక్షి మెదక్

గురువారం, 9, నవంబర్, 2023



సోషల్ వార్..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల నాయకుల సోషల్‌మీడియాపై దృష్టి సారించారు.

వివరాలు IIలో ▸



అభ్యర్థుల సెంటిమెంట్

అభ్యర్థులు.. ఇష్టదైవాన్ని నమ్ముకుంటున్నారు. ఎన్నికల వేళ.. గెలుపు కోసం తమ వంతు ప్రయత్నంతోపాటు సెంటిమెంట్‌లకు పెద్ద పీట వేస్తున్నారు.

వివరాలు IIలో ▸



భవనం నిర్మించేదెన్నడో?

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వ భవనాన్ని కూల్చి వేశారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

నాలుగు నామినేషన్ల దాఖలు

ఎన్నికల అధికారికి అందజేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బుధవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి తరపున ఆమె బంధువు శ్రీనాథ్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ తరపున ఆయన భార్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి పలువురు నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డి తన భార్య శైలజతో పాటు పలువురు నాయకులతో వెళ్లి నామినేషన్ అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ కూడా తన అనుచరులతో కలిసి వెళ్లి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నర్సాపూర్ నియోజకవర్గ బీ ఫామ్ ఇప్పటికే ఆవుల రాజిరెడ్డికి అందజేసినప్పటికి గాలి అనిల్‌కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగానే నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.

మాజీ ఉపముఖ్యమంత్రి వాహనం తనిఖీ



దామోదర్ వాహనాన్ని తనికీ చేస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం ఆయన ప్రచారంలో భాగంగా వెళుతుండగా అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. దామోదర్ రాజనర్సింహ పోలీసులకు సహకరించారు. దామోదర్ వాహనంతో పాటు ఆయన వెంట వచ్చిన వాహనాలన్నింటినీ పోలీసులు తనఖీ చేశారు.

పఠనాసక్తికి గ్రంథాలయాలు దోహదం

డీఈవో రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

నిజాంపేట(మెదక్): తరగతి గదుల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక పద్ధతి ప్రకారం ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో ఆదేశించారు. మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, యాదగిరి, మాధురీదేవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సంక్షేమానికి ప్రాధాన్యం

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల కులస్తుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మెదక్‌లోని మాయగార్డెన్‌లో ఎరుకల ఆత్మీయ సమ్మేళనసభ నిర్వహించారు. ఆ సభకు ఆమె హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు కుల వృత్తులను విస్మరించాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఎరుకల కులస్తులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పందుల పెంపకానికి నిధులు కేటాయించిందని, కులస్తులు సొసైటీగా ఏర్పడి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్షపతి, జిల్లా, మండలాల ఎరుకల సంఘం అధ్యక్షులు, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు జరుగుతుందని లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

మెదక్‌లో గెలుపొంది.. ఉన్నత పదవుల్లోకి

- ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉప సభాపతిగా
- చరిత్రలో నిలిచిన నలుగురు నేతలు

మెదక్: మెదక్ జిల్లా ఎంతో మందికి మంచి పదవులను అందించి వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. ప్రముఖులుగా చరిత్రలో లిఖించింది. గతంలో ఇక్కడి నుంచి పోటీచేసి గెలిచిన నాయకులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉప సభాపతి లాంటి ఉన్నతమైన పదవులు అలంకరించారు. అలా ఉన్నత పదవులను కైవసం చేసుకున్న వారంతా చరిత్రపుటల్లో నిలిచిపోయారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోను మెదక్ జిల్లాకు ఆ విధమైన ప్రత్యేక ఏర్పడింది. ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీచేసి విజయం సాధించి దేశానికి ప్రధానమంత్రి అయ్యారు.

ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ



1980లో లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా ఇందిరాగాంధీ(కాంగ్రెస్) నుంచి పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొంది దేశ ప్రధానమంత్రి పదివిని అలంకరించారు. అప్పట్లో ఇందిరాగాంధీకి 3,01,577 ఓట్లు రాగా తన ప్రత్యర్థి జనతాపార్టీకి చెందిన జైపాల్‌రెడ్డికి 82,453 ఓట్లు వచ్చాయి. ఇందిరాగాంధీ 2,19,124 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

పద్మాదేవేందర్‌రెడ్డి



పద్మాదేవేందర్‌రెడ్డి 2001లో టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2001లో రామాయంపేట జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2004లో ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. అనంతరం స్వరాష్ట్రం కోసం 2008లో కేసీఆర్ పిలుపు మేరకు తన పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీచేయగా ఓడిపోయారు. ఆ తరువాత 2009లో టికెట్ దక్కక పోవడంతో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమి చవిచూశారు. 2014లో మెదక్ ఎమ్మెల్యేగా గెలుపొంది తెలంగాణలో తొలి ఉప సభాపతిగా పనిచేసి చరిత్రలో నిలిచారు. అనంతరం 2018లో సైతం ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు.

ముఖ్యమంత్రిగా అంజయ్య



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మెదక్ జిల్లా రామాయంపేట నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన టి.అంజయ్య 1980 అక్టోబర్ నుంచి 1982 ఫిబ్రవరి వరకు 16 నెలల పాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పట్లో చెన్నారెడ్డి సీఎంగా కొనసాగుతున్న సందర్భంగా ఆయనను మార్చి అంజయ్యకు సీఎంగా అవకాశం కల్పించారు. ఆయన అప్పట్లో కేంద్ర మంత్రిగా పనిచేస్తుండగా దానికి రాజీనామా చేసిన ఆయన ఎమ్మెల్యేగా ఎంపిక కాకుండానే సీఎం పదవి చేపట్టారు. రాజ్యాంగం ప్రకారం ఆరు నెలల్లో ఏదో ఒక చోటు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాలి. ఈ నేపథ్యంలో అప్పటికే రామాయంపేట ఎమ్మెల్యేగా ముత్యం రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తుండగా టి.అంజయ్య కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో రామాయంపేట స్థానానికి ఎన్నికలు నిర్వహించగా ప్రతిపక్షాలు సైతం నామినేషన్ వేయక పోవడంతో టి.అంజయ్య ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నికై సీఎం పదవిని అలంకరించి 16 నెలల పాటు కొనసాగారు.

ఉప ముఖ్యమంత్రిగా జగన్నాథరావు



మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యే గెలుపొందిన సీహెచ్ జగన్నాథరావు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఫిబ్రవరి 24 నుంచి సెప్టెంబర్ 20 వరకు సుమారు ఏడు నెలల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.



కేవీకేలో ఓటు హక్కుపై వేసిన ముగ్గులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ఓటు హక్కుపై వేసిన ముగ్గుల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటు ఉన్న విద్యార్థులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కౌడిపల్లి మండలం తునికి వద్దగల కృషి విజ్ఞాన కేంద్రంలో ఓటుహక్కుపై విద్యార్థులు అవగాహన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించారు. విద్యార్థులందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం స్వీప్ నోడల్ అధికారి, డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, వందశాతం ఓటింగ్‌లో పాల్గొని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి రాజిరెడ్డి, సీడీపీఓ హేమభార్గవి, ఐసీడీఎస్ నర్సాపూర్, కౌడిపల్లి సూపర్‌వైజర్లు సరళ, శశికళ, లక్ష్మి, కేవీకే హెడ్ నల్కర్, శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

నర్సాపూర్: చెక్ పోస్టు మీదుగా వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా ఆదేశించారు. సాధారణ ఎన్నికల సందర్భంగా జాతీయ రహదారిపై నర్సాపూర్ హైదరాబాద్ మార్గంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వాహనాల తనిఖీ, పట్టుబడిన నగదు వివరాల రిపోర్టును, చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారుల పని తీరును ఆయన పరిశీలించారు. చెక్ పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, 24 గంటలు సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక నిఘా కోసం ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు మెరుగైన పని తీరును కనబర్చాలని రాజర్షి షా సూచించారు.

స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట బందోబస్తు

స్ట్రాంగ్ రూం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా ఆదేశించారు. నర్సాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు భద్రపర్చిన బీవీరాజు ఇంజనీరింగు కాలేజీలోని స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టంగా భద్రత ఉండాలని చెప్పారు. స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు ఏర్పాటు, ఇతర వివరాలను జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షాకు స్థానిక ఎన్నికల అధికారులు వివరించారు.

ఇండోర్ గేమ్స్‌ను ప్రోత్సహించడం అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్



బహుమతులు పొందిన విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ తదితరులు

మెదక్ మున్సిపాలిటీ: టేబుల్ టెన్నిస్ లాంటి ఇండోర్ గేమ్స్‌ను ప్రోత్సహించడం అభినందనీయమని మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ పేర్కొన్నారు. బుధవారం మెదక్‌లోని గుల్షన్ క్లబ్‌లో ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ కం సెలక్షన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొక్కొండ ప్రభు ఎంపిక పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. పురుషుల విభాగంలో అనీష్ ప్రథమం, శ్రీనివాస్‌చారి ద్వితీయ, రవితేజ తృతీయ స్థానాల్లో గెలుపొందారు. మహిళల విభాగంలో వి.సృజన ప్రథమ, ఏ.దీపిక ద్వితీయ, సీహెచ్.మౌనిక తృతీయ బహుమతులను సాధించారు. బాలుర విభాగంలో వి.వర్షిత్, నిఖిల్, నరేశ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందారు. పోటీల అనంతరం స్థానిక రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఆనందం, గుల్షన్ క్లబ్ సెక్రటరీ శ్యామ్‌రావు విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి మధు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్, పీఈటీల సంఘం కార్యదర్శి శ్రీనివాస్, గుల్షన్ క్లబ్ సభ్యులు హనుమంతు, పీఈటీలు మమత, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

భైతి దుర్గయ్యకు బాల సాహిత్య పురస్కారం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ కవి, బాలసాహితీ వేత్త భైతి దుర్గయ్యకు బాల సాహిత్య వికాస పురస్కారం వరించింది. ఈమేరకు బుధవారం బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ బాల సాహిత్యంలో విశిష్ట సేవ చేసినందుకు గాను తెలుగు సాహిత్య కళా పీఠం ఈ పురస్కారం ప్రకటించిందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే సమావేశంలో పురస్కారం స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన బాల సాహిత్య రచయితలు, ఉపాధ్యాయులు దుర్గయ్యను అభినందించారు.

అభ్యర్థుల ఖాతాల్లోకి పార్టీ ఖర్చులు

- సువిధ యాప్ ద్వారా ప్రచారానికి అనుమతులకు
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: రాజకీయ పార్టీల ప్రచార ఖర్చులు, ఇతర కార్యక్రమాల ఖర్చులను అభ్యర్థుల ఖాతాలో నమోదు చేస్తారని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుంచి నియమావళి వర్తిస్తుందన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పుడు నియమావళి కిట్టు అందజేయడం జరుగుతుందని, దానికనుగుణంగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచార సభలకు, సమావేశాలకు సువిధ యాప్‌ద్వారా అనుమతులు మంజూరవుతాయని తెలిపారు. వాహనాల పత్రాలు అడిగిన వెంటనే సమర్పించాలని, హెలీప్యాడ్ కోసం స్థల యాజమని పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. 1950 టోల్ ఫ్రీ, సివిజిల్, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు



సునీతారెడ్డి
బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి



మదన్‌రెడ్డి
సిట్టింగ్ ఎమ్మెల్యే

నర్సాపూర్: రాజకీయంలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనేది నిజమేనని నియోజకవర్గంలోని ఇద్దరు నేతలు నిరూపించారు. ఆ ఇద్దరు ఒకప్పుడు ప్రత్యర్థులు. నేడు ఒకే పార్టీలో నేతలయ్యారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే వారు కలిసి ప్రచారానికి వెళ్లడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతారెడ్డి ప్రస్తుతం ఒకే పార్టీ నేతలుగా కొనసాగుతున్నారు. అంతే కాదు కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

ప్రత్యర్థులుగా.. పోటీపోటీగా..

1999, 2004 సంవత్సరాలలో జరిగిన సాధారణ ఎన్నికలలో నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ చేయగా టీడీపీ అభ్యర్థిగా చిలుముల మదన్‌రెడ్డి పోటీ చేశారు. వారిద్దరు ప్రత్యర్థులుగా పోటీలో ఉండగా సునీతారెడ్డి చేతిలో మదన్‌రెడ్డి ఓడిపోయారు. అయితే 2014, 2018లో జరిగిన సాధారణ ఎన్నికలలో నర్సాపూర్ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా చిలుముల మదన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతారెడ్డి ప్రత్యర్థులుగా పోటీపడగా సునీతారెడ్డిపై మదన్‌రెడ్డి గెలుపొందారు. రెండు సార్లు మదన్‌రెడ్డిపై సునీతారెడ్డి విజయం సాధించగా ప్రత్యేక తెలంగాణ వచ్చాక సునీతారెడ్డిపై మదన్‌రెడ్డి రెండు సార్లు విజయం సాధించారు. ఆ తర్వాత పరిణామాలతో సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ చేరారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ నర్సాపూర్ టికెట్‌ను సునీతారెడ్డికి ఇవ్వడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. సునీతారెడ్డికి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. ఇది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

సంగారెడ్డికి ఐటీ హబ్, మెట్రో

- బహిరంగ సభలో మంత్రి కేటీఆర్



రోడ్డుషోలో కేటీఆర్

సంగారెడ్డి: సంగారెడ్డికి మెట్రో రైలు, ఐటీ హబ్ నిర్మాణం జరగాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కంది నుంచి సంగారెడ్డి వరకు కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ మధ్య రోడ్ షో గంజిమైదాన్ వరకు చేరుకొని ముగిసింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ సన్నాసులకు ఒక్క చాన్స్ ఎందుకివ్వాలి? అని ప్రశ్నించారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి తాను గెలుస్తానని, బీఆర్‌ఎస్‌లో చేరుతానని చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. జగ్గారెడ్డిని పార్టీలో చేర్చుకుంటే చింతా ప్రభాకర్‌కు టికెట్ ఎందుకు ఇస్తామని, గెలిపించమని ఎందుకు కోరుతామని స్పష్టం చేశారు. ఇప్పుడు జరిగిన భారీ బైక్ ర్యాలీ, రోడ్ షోను చూస్తే ప్రభాకర్ గెలుపు తేలికవుతోందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చిన వెంటనే కేసీఆర్ భరోసా పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

రాజకీయంగా ఎదిగితేనే భవిష్యత్తు

- కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ
- 50 ఏళ్లు నిండిన వారికి ఆసరా పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం కౌడిపల్లి మండలం తునికి నల్లపోచమ్మదేవి ఆలయంవద్ద నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మర సంఘం సమావేశం నిర్వహించారు. యన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కుమ్మరులు సంఘాలను ఏర్పాటు చేసుకుని ఐకమత్యంగా ఉండాలన్నారు. కులవృత్తిలో సరైన ఆదరణలేక ఇతర వృత్తులకు వెళుతున్నారని వాపోయారు. ప్రభుత్వం కులవృత్తులను ఆదుకోవాలని, తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద రెండు ఎకరాల భూమిని కేటాయించి కుమ్మరుల ఆధునికంగా కుండలు, ఇతర మట్టిపాత్రల తయారీపై శిక్షణ ఇవ్వాలని కోరారు. ఆధునిక యంత్రాలను అందజేయాలని, అర్హులైన కుమ్మరులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే 50 ఏళ్లు నిండిన కుమ్మరులకు ఆసరా పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్, ఉపాధ్యక్షుడు బాలేశ్, ప్రచార కార్యదర్శి గంగయ్య, కౌన్సిలర్ నగేశ్, నాయకులు శ్రీకాంత్, గణేశ్, యాదగిరి, వివిధ మండలాల అధ్యక్షులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట వర్షార్పణం

- వివిధ మండలాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



రంగంపేట పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లు



టేక్మాల్‌లో రోడ్డుపై తడిసిన దాన్యం

కొల్చారం(నర్సాపూర్)/టేక్మాల్(మెదక్)/ కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నపాటి చినుకులుగా ప్రారంభమైన వర్షం ఒక్కసారిగా భారీ వర్షంగా మారడంతో కొల్చారం మండల వ్యాప్తంగా కళ్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయి పోయింది. అరగంట పాటు ఆగకుండా వర్షం కురవడంతో రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం కళ్ల ముందే కొట్టుకొని పోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షంతో తడిసి ముద్దవ్వడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అలాగే టేక్మాల్‌లో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లపై, పంట పొలాల్లో ఆరబోసిన వరి ధాన్యం నీట మునిగింది. ఆరబోసిన ధాన్యం, కుప్పలుగా ఉన్న వరి పూర్తిగా తడిసిపోయిందని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కౌడిపల్లితో పాటు వివిధ గ్రామాలలో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎండబెట్టిన ధాన్యం తడిసి పోయింది. దీంతో రైతులు ఆందోళన చెందారు.

హోరెత్తిన ప్రచారం



జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు పోటీ పడుతుండగా, కాంగ్రెస్ తరఫున ఎ.చంద్రశేఖర్ పోటీ పడుతున్నారు. ఇరువురికి మొదటి విడతలోనే ఆయా పార్టీల అధిష్టాన వర్గాలు టిక్కెట్లు ఖరారు చేయడంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బీజేపీ టికెట్ కాస్త ఆలస్యంగానైనా రాంచందర్ రాజనర్సింహాకి రావడంతో కార్యకర్తలను ప్రచారానికి సిద్ధం చేస్తున్నారు. –జహీరాబాద్

దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- ప్రచారానికి సిద్ధమైన బీజేపీ
- సైలెంట్‌గా ముందుకెళ్తున్న బీఎస్పీ
- జహీరాబాద్‌లో హోరాహోరీ



నియోజకవర్గం పరిధిలోని జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో మొదటి విడత ఎన్నికల ప్రచారాన్ని ప్రధాన పార్టీలు పూర్తి చేశాయి. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్, భార్య ప్రమీల తలా ఓ దిక్కు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టి చివరి దశకు తీసుకొచ్చారు. ఇరు పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేసి కార్యకర్తల్లో జోష్ నింపారు. ఇప్పటికే చంద్రశేఖర్ నామినేషన్ సైతం దాఖలు చేశారు.

మేనిఫెస్టోతో ముందుకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోనే ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ప్రచారంలో కరపత్రాలను పంచుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మాణిక్‌రావు, కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను చంద్రశేఖర్ వివరిస్తూ ఓట్లడుగుతున్నారు.

ఇప్పుడిప్పుడే బీజేపీ సన్నద్ధం

అభ్యర్థిని ప్రకటించడంలో బీజేపీ తీవ్ర జాప్యం చేసింది. రెండు రోజుల క్రితం రాంచందర్ రాజనర్సింహా అభ్యర్థిత్వాన్ని అధిష్టాన వర్గం ఖరారు చేయడంతో ఆయన కార్యకర్తలను ప్రచారానికి సిద్ధం చేస్తున్నారు. టికెట్‌ను గట్టిగా ఆశించి భంగపడ్డ ఢిల్లీ వసంత్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అలాగే, బీఎస్పీ అభ్యర్థి జంగం గోపి మాత్రం ఆర్భాటాలకు వెళ్లకుండా చాపకింద నీరులా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీ గుర్తు ఏనుగును వాహనంపై పెట్టి ప్రచారం చేస్తున్నారు.

ముఖ్యనేతలను తీసుకొచ్చే పనిలో..

నియోజకవర్గంలో ముఖ్య నేతలతో ప్రచారం చేసేందుకు ప్రధాన పార్టీలు సన్నద్ధం అయ్యాయి. సీఎం కేసీఆర్ ఈనెల 23వ తేదీన జహీరాబాద్ సభలో పాల్గొననున్నారు. కాంగ్రెస్ తరఫున ప్రియాంక లేదా రాహుల్ గాంధీతో ప్రచారం చేయించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. బీజేపీ తరఫున ఈనెల 10వ తేదీన కేంద్రమంత్రి నారాయణ రాణేతో కలిసి అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహా నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

జంగ్ తెలంగాణ

సోషల్ వార్..

- సోషల్ మీడియాలో నాయకుల విస్తృతప్రచారం
- నాయకులు, దోస్తుల పేరిట ప్రత్యేక గ్రూపులు
- క్షణాల్లో కళ్లముందర సమాచారం



దుబ్బాకటౌన్ : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల నాయకులు సోషల్‌మీడియాపై దృష్టి సారించారు. ఓ వైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రజల్లో ఉంటూనే ప్రత్యర్థుల ఆటకట్టించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. తాము చేసిన పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు తమను విమర్శించే వారి నుంచి స్వీయ రక్షణ పొందేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ తమ పరిధిలో ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను నియమించుకుంటూ వార్‌కు సిద్ధం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారం ఎక్కువగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో కనిపిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న నియోజకవర్గ అభ్యర్థులు సోషల్ మీడియాను బాగా వినియోగించుకుంటున్నారు. తమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ కార్యక్రమం వారు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల ద్వారా క్షణాల్లో ఫొటోలు, వీడియోలతో పంపిస్తున్నారు. తమకు ఓట్లు వేసేలా ప్రత్యేక గ్రూపులతో నేతలు ప్రచారం చేస్తుండడం విశేషం. ఈ ఎన్నికల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరిట కేపీఆర్ సైన్యం, దుబ్బాక బీఆర్‌ఎస్ సైన్యం, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేరిట రఘునన్న యువసైన్యం, బీజేపీ మీడియా గ్రూపు, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేరిట శ్రీనన్న సైన్యం, దుబ్బాక కాంగ్రెస్ సేన పేరిట గ్రూపులు క్రియేట్ చేసి జోరుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో హరీశన్న సైన్యంతోపాటు రకరకాల గ్రూపులు వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

క్లుప్తంగా

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్ : నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): హామీలను విస్మరించి ప్రజల విశ్వాసం కోల్పోయిన కేసీఆర్‌ను ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వర్గల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలిచిన వెంటనే గజ్వేల్ పట్టణ నిరుపేదలకు 5 వేల ఇళ్లు నిర్మించి ఇస్తానన్న హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, స్థానిక సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, పార్టీ మండలఅధ్యక్షుడు సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా..

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ నిర్వాసితులకు అండగా ఉండి ఆదుకుంటానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేట, చందాపూర్, రాంపురం, లింగంపేట గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం అందించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. తుక్కాపూర్ నిర్వాసితులకు రూ.16 లక్షల పరిహారం అందించే చర్యలు తీసుకున్నామన్నారు. ఎల్లారెడ్డిపేట, ఘనపురం, బండారుపల్లి గ్రామాల నిర్వాసితులకు పరిహారం అందేలా కృషిచేశానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రం, సర్పంచ్ నర్సింలు యాదవ్, ఎంపీటీసీ నర్సింలు, నాయకులు స్వామిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే అభివృద్ధి

దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్, చీకోడ్, ఆరెపల్లి, పోతారం, అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. దుబ్బాకలో బస్సుడిపో, కోర్టు, మున్సిపాలిటీ, ఐటీఐ, డిగ్రీ కళాశాల, ప్రతీ మారుమూల గ్రామంలో సీసీ రోడ్లు వేసిన ఘనత ముత్యంరెడ్డికే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని వారి మాయ మాటలు నమ్మకూడదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపు కోసం హోమం



హోమం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి దంపతులు

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి మండల పరిధిలోని గురువన్నపేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు బుడిగె ఐలేని, అశోక్, జిల్ల సంపత్, పాల్గొన్నారు.

భగవంతుడి ఆశీస్సులతో..

- కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత
- కోనాయిపల్లి వెంకటేశ్వర ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజ
- నేడు దుబ్బాకలో నామినేషన్, హాజరుకానున్న హరీశ్‌రావు



కోనాయిపల్లి వెంకటేశ్వర ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు చేస్తున్న మంజులతారెడ్డి

దుబ్బాకటౌన్ : దేవుడి దయ.. ప్రజల ఆశీస్సులతోనే నా భర్త ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారని కొత్త మంజులతారెడ్డి అన్నారు. బుధవారం మంజులతారెడ్డి భర్త ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను కోనాయిపల్లి వెంకటేశ్వరాలయంలో స్వామివారి పదాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుబ్బాకలో భారీ మెజార్టీతో ప్రభాకర్‌రెడ్డి గెలుపొందడం ఖాయమని అన్నారు. భగవంతుడి కరుణ, మీ ఆశీస్సులు ఉన్నన్ని రోజులు ప్రజాసేవ చేస్తామన్నారు.

ఆస్పత్రి నుంచి నేరుగా..

కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సూరంపల్లిలో దుండగుడి చేతిలో కత్తిపోటుకు గురై తీవ్ర గాయాలతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నామినేషన్ వేసేందుకు గురువారం ఉదయం 11.15కు ఆస్పత్రి నుంచి ప్రత్యేక వాహనంలో రానున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో దుబ్బాకలోని ఐఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ చాంబర్‌లో నామినేషన్ వేస్తారని మంజులతా రెడ్డి తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. నామినేషన్ అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి పట్టణంలో ప్రధాన వీధుల గుండా జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

అభ్యర్థుల సెంటిమెంట్

- ఇష్టదైవాన్ని నమ్ముకుంటున్న అభ్యర్థులు
- కోనాయిపల్లిలో నామినేషన్ పత్రాలపై కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు
- మేనమామ సంతకంతో హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్
- తల్లి దీవెనలతో పొన్నం ప్రభాకర్
- గెలుపు కోసం ఎవరి సెంటిమెంట్ వారిది

సాక్షి, సిద్దిపేట : ఎన్నికల వేళ.. గెలుపు కోసం తమ వంతు ప్రయత్నంతోపాటు ఇష్టదైవాన్ని నమ్ముకోవడం, సెంటిమెంట్‌లకు పెద్ద పీట వేస్తున్నారు. శాసన సభ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్‌ల స్వీకరణ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే పలువురు ఆయా నియోజవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేయగా, మరి కొందరు మంచి ముహూర్తాలతోపాటు సెంటిమెంట్ దేవాలయాల్లో పూజలు, సెంటిమెంట్ వ్యక్తులతో నామినేషన్ పత్రాలపై ప్రతిపాదన సంతకాలు చేపిస్తున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, తల్లి తండ్రులు, గురువుల ఆశీర్వాదం తీసుకొని నామినేషన్‌లను దాఖలు చేస్తున్నారు. 9వ తేదీ గురువారం ఏకాదశి, 10వ తేదీ శుక్రవారం ద్వాదశి ఉండడంతో ఈ చివరి రెండు రోజులు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నేడు, రేపు నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

నేడు ప్రభాకర్ రెడ్డి నామినేషన్



నేడు దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త ప్రభాకర్ రెడ్డి నామినేషన్ వేయనున్నారు. తొలుత కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తర్వాత పోతారం హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి మంత్రి హరీశ్ రావుతో కలిసి నామినేషన్ వేయనున్నారు.

తల్లి దీవెనలు...



హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పొన్నం ప్రభాకర్ గౌడ్ తల్లి దీవెనలు తీసుకొని నామినేషన్ వేశారు. ప్రతీ సారి తల్లి మల్లమ్మ దీవెనలు తీసుకుంటున్నారు. తర్వాత రేణుక ఎల్లమ్మను దర్శించుకున్నారు. పొట్లపల్లి స్వయం భూ రాజేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత ర్యాలీగా వచ్చి నామినేషన్‌ను దాఖలు చేశారు.

కోనాయిపల్లిలో సీఎం కేసీఆర్..



బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్ రావులు ఇద్దరికీ నంగనూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలోనే నామినేషన్ పత్రాలపై సంతకాలు పెట్టడం సెంటిమెంట్. గజ్వేల్, కామారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న హరీశ్‌రావు ఈ నెల 4వ తేదీన కోనాయిపల్లిలో నామినేషన్‌లపై సంతకాలు చేశారు. కేసీఆర్ 38 ఏళ్లుగా ఇదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తుండగా , 2004 నుంచి హరీశ్ రావు అదే సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. నేడు గజ్వేల్‌లో కేసీఆర్, సిద్దిపేటలో హరీశ్ రావు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ప్రతిపాదనల్లో మేనమామ సంతకం



తండ్రి ఆశీస్సులు తీసుకుంటున్న సతీష్ కుమార్

హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్ కుమార్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. నామినేషన్ పత్రాలపై తన మేనమామ వేముగంటి భాస్కర్ రావుతో తొలి ప్రతిపాదన సంతకం చేయించడం సెంటిమెంట్, ఈసారి సైతం అదే పాటించారు. బుధవారం స్వగ్రామం సింగపురంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత హుస్నాబాద్‌లో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం నాన్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆశీర్వాదం తీసుకున్నారు.

స్వగ్రామంలో పూజలు..



దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు తొలుత స్వగ్రామం బొప్పాపూర్‌లో బొడ్రాయి వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుబ్బాకలోని మారెమ్మ దేవాలయంలో నామినేషన్ పత్రాలు పెట్టి పూజలు నిర్వహించి, నామినేషన్ దాఖలు చేశారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జాగృతి జాతీయ అధ్యక్షులు అనంతుల ప్రశాంత్ కోరారు. మండల కేంద్రమైన కొండపాకలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చిట్టి మాధురీరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేయడం చేతకానీ కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లో తిరుగుతూ మాయమాటలు చెబుతూ ఓట్లు దండుకునేలా చూస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మంచాల అనుసూయ, ఆరుట్ల లక్ష్మి, నాయకులు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, సింగాటం రాములు, గోనె శ్రీనివాస్, దొమ్మాట మహిపాల్‌రెడ్డి, బొద్దుల కనుకయ్య, రాధాకిషన్ రెడ్డి, అనంతుల పద్మ, రామక్రిష్టారెడ్డి, అనంతుల నరేందర్, ఎగుర్ల వెంకటేశం, తోటకూరి మల్లేశం, జిర్ర రాజు, బోదాస్ స్వామి, సున్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడుకులా సీఎం కేసీఆర్

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పార్టీలకు అతీతంగా వివిధ రకాల పెన్షన్లు అందిస్తూ పెద్దకొడుకులా నిలిచిన సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కోరారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షులు స్వామి, తూం శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మహిళలందరూ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో డ్యాన్సులు చేస్తూ బతుకమ్మ పండుగ సంబురం తలపింపజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, నాయకులు మహేశ్, కిరణ్ కుమార్‌చారి, బాల్ నర్సు, సాయిలు, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోల శ్రీనివాస్, లగిశెట్టి కనకయ్య, మల్లం ఐలయ్య, కందూరి ఐలయ్య, మిట్టపల్లి రుషీ, కొంతం రాజు, తూం మహేందర్,కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

18న రెండో విడత ర్యాండమైజేషన్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఈవీఎంల రెండోవిడత ర్యాండమైజేషన్‌ను ఈనెల 18న పర్యవేక్షించి, ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోలింగ్ విధుల నిర్వహణపై కలెక్టరేట్‌లో రిటర్నింగ్, అసిస్టెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గానికి అవసరమైన వాహనాలను రవాణా శాఖ నుంచి సమకూర్చడం జరుగుతుందని, అదనంగా వాహనాలను సమకూర్చుతామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి రిసెప్షన్ సెంటర్ వరకు వాహనాలకు జీపీఎస్ అమర్చుతామన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక రంగులతో కూడిన బ్యానర్లను వాహనాలకు ఏర్పాటు చేయాలని, 21, 22, 23 తేదీల్లో ఎన్నికల పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ రోజు ఈసీఐ నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూట్లవారీగా ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనేలా పోలీస్‌శాఖ సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు.

ఈవీఎం మిషన్లపై శిక్షణ...

ఈవీఎం మిషన్ల నిర్వహణపై జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నాలుగు నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ముఖ్యమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఎలక్షన్ అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, దుబ్బాక, సిద్దిపేట హుస్నాబాద్ ఆర్వోలు గరిమా అగర్వాల్, రమేశ్ బాబు, బెన్ సాలెం, డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా రవాణా శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, ఎంవీఐలు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లి' దీవెనలు ఎవరికో..



కరచాలనం చేసుకుంటున్న సతీష్‌కుమార్, పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం నామినేషన్ల సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఇద్దరూ దేవాలయంలో ఆప్యాయంగా పలుకరించుకొని కరచాలనం చేసుకున్నారు. ఎల్లమ్మ దేవత దీవెనలు ఎవరికి ఉంటాయో ఎన్నికల ఫలితాలు వెల్లడైతే గాని తెలియదు.

చేసిన అభివృద్ధి అంతా కాంగ్రెస్‌దే

టేక్మాల్(మెదక్): రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే కాంగ్రెస్ చేసినా అభివృద్ధియే తప్పా బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమీలేదని కాంగ్రెస్ పార్టీ అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎల్లంపల్లి, గొల్లగూడెం, పల్వంచ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఎల్లంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ మండలాధ్యక్షుడు కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.



ప్రచార 'పండు'గలో కాసేపు..

టేక్మాల్(మెదక్): ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ బుధవారం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి 161 హైవే వద్ద కాసేపు ఆగి కార్యకర్తలతో టీ తాగారు. అనంతరం హైవే వెంబడి సీతాఫలాలు అమ్ముతున్న వారి వద్ద పండ్లు కొనుగోలు చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట చింత రవి, అవినాష్, చంద్రశేఖర్‌రెడ్డి, బహిరన్‌దిబ్బ దుర్గయ్య పాల్గొన్నారు.



అవ్వా.. కారుకు ఓటేయ్

చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారంలో భాగంగా బుధవారం చేర్యాల పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఓ ఇంటి ముందు చీపురు తయారు చేస్తున్న అవ్వను ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.